ప్రారంభించారు.. వదిలేశారు..

పరికరాల్లో కొన్ని మాయం.. మరికొన్నింటికి తుప్పు

- ఇప్పటికీ జిమ్ ఉన్న కమ్యూనిటీహాల్‌కు తాళమే
- ఇందిరానగర్‌వాసులకు అందుబాటులోకి రాని జిమ్

బంజారాహిల్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీహాల్ కోసం బస్తీ వాసులు ఓ పోరాటమే చేశారు. మొత్తానికి అప్పటి పాలకులు కమ్యూనిటీహాల్ నిర్మించారు. దానిని స్థానికులకు అందుబాటులో ఉంచితే సరిపోయేది. యువత కోసం ప్రభుత్వ నిధులతో జిమ్ ఏర్పాటు చేశారు. కానీ, ఏం లాభం స్థానికంగా రెండువర్గాల మధ్య తలెత్తిన వివాదం వల్ల జిమ్ మూతపడింది. పన్నెండు సంవత్సరాలుగా జిమ్‌కు పడిన తాళం తెరుచుకోలేదు. లోపల ఉన్న వ్యాయామ పరికరాలు కొన్ని మాయమవగా.. మరికొన్ని తుప్పు పట్టి ఎందుకు పనిరాకుండా తయారయ్యాయి. ఇటు జిమ్ అందుబాటులోకి రాక, అటు కమ్యూనిటీహాల్ వినియోగించలేని పరిస్థితి జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో నెలకొంది.



జిమ్ ఉన్న భవనం

నామమాత్రంగా మారిన భవనం..

ఇందిరానగర్ కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం సుమారు 20 సంవత్సరాల క్రితమే శంకుస్థాపన జరిగింది. అప్పట్లోనే ప్రజాప్రతినిధులు హంగు, ఆర్భాటాలతో పనులను ప్రారంభించారు. గోడలు, ద్వారాల నిర్మాణం పూర్తయిన తర్వాత గుత్తేదారు మధ్యలోనే పనులు ఆపేసి ముఖం చాటేశాడు. అప్పటి నుంచి స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చివరకు ఎన్నికలప్పుడు అప్పటి ప్రజాప్రతినిధి కలగజేసుకొని కమ్యూనిటీహాల్‌ను పూర్తి చేశారు. ఇందులో జిమ్ ఏర్పాటు చేయాలని స్థానికుల విజ్ఞప్తి వైపు మొగ్గు చూపించారు. ఈ మేరకు నిధులు కేటాయించి జిమ్‌ను ఏర్పాటు చేశారు. 2015లో జిమ్‌ను ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ, జిమ్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు మూడు నెలల సమయం పట్టింది.

పెత్తనం కోసం...

జిమ్ పూర్తయ్యాక నిర్వహణ విషయంలో రెండువర్గాలు పోటీ పడ్డాయి. తామంటే తాము చూసుకుంటామంటూ గొడవకు దిగారు. ఇరువురి మధ్య తలెత్తిన వివాదంతో జీహెచ్ఎంసీ అధికారులు తాళం వేశారు. దానిని ఎవరికి అప్పగించాలో తెలియక అధికారులు తికమక పడ్డారు. జిమ్ ఎవరికి అప్పగించినా బస్తీలో రాజకీయ గొడవలు జరిగే ప్రమాదం పొంచి ఉందని అధికారులు కొన్నిరోజులు జిమ్ నిర్వహణను వాయిదా వేస్తూ వచ్చారు. అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రస్తుతం జిమ్ పరికరాలు తుప్పుపట్టి ఎందుకు పనికి రాకుండా మారి ఉంటాయని స్థానికులు అంటున్నారు. అంతేగాకుండా కొన్ని పరికరాలను ఓ వర్గం వారు చోరీ చేసినట్టు ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

కమ్యూనిటీహాల్ లేక అవస్థలు

ఇందిరానగర్‌వాసులు ఏళ్ల తరబడి పోరాడి కమ్యూనిటీహాల్ సాధించుకున్నారు. రెండంతస్తుల భవనం నిర్మాణం పూర్తయింది. కింద బస్తీ దవాఖానా ఏర్పాటు చేశారు. మొదటి అంతస్తులో జిమ్ పెట్టడంతో బస్తీ వాసులు చిన్నపాటి సమావేశాలు నిర్వహించేందుకు కమ్యూనిటీహాల్ లేకుండా పోయింది. ఎలాగో జిమ్ పూర్తిస్థాయిలో దెబ్బతిని ఉంటుంది. ఆ పరికరాలను తొలగించి కొత్త జిమ్ అందుబాటులోకి తీసుకురావాలని, లేదంటే ఖాళీ చేసి తమకు అప్పగిస్తే బస్తీ అవసరాలకు ఉపయోగించుకుంటామని స్థానికులు కోరుతున్నారు.

> **అధికారులు, పాలకులు కలగ చేసుకోవాలని**
>
> ఇందిరానగర్ జిమ్‌ను కొత్తగా చేసి తెరిపించేందుకు అధికారులు, పాలకులు కలగ చేసుకోవాలి. లేదంటే కనీసం కమ్యూనిటీహాల్‌ను అయినా అందుబాటులోకి తీసుకురావాలి. ఇప్పటికే సంవత్సరాలు దాటింది. నిరుపయోగంగా జిమ్ కనిపిస్తున్నా అధికారులు కనీసం పట్టించుకునేందుకు కూడా మొగ్గు చూపించలేదు. మొదట్లోనే రెండువర్గాల మధ్య సామరస్యంగా సమస్య పరిష్కరించి ఉంటే బాగుండేది.
>
> - మహి, స్థానికుడు
>
> **నిర్లక్ష్యంగా వదిలేశారు..**
>
> లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జిమ్‌ను నిర్లక్ష్యంగా వదిలేశారు. ఏదో ఒకటి చేసి జిమ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, ప్రజాప్రతినిధులను పలుమార్లు కోరాం. ఎవరూ పట్టించుకోలేదు. ఇంకా నిర్లక్ష్యం చేస్తే కమ్యూనిటీహాల్ కూడా దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది. - పవన్, స్థానికుడు

దేవసేనకు దాసరి ఫిల్మ్ అవార్డు ప్రదానం


డా.దేవసేనకు దాసరి ఫిల్మ్ అవార్డును బహూకరిస్తున్న సుప్రసిద్ధ సినీనటులు మురళీమోహన్, సుమన్, సాయికుమార్, దర్శకులు అనిల్ రావిపూడి

చిక్కడపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): సిద్ధేంద్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు డా.దేవసేనకు దాసరి ఫిల్మ్ అవార్డును ప్రదానం చేశారు. శుక్రవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగిన కార్యక్రమంలో సుప్రసిద్ధ సినీనటులు మురళీమోహన్, సుమన్, సాయికుమార్, సినీదర్శకులు అనిల్ రావిపూడి అవార్డును బహూకరించి దేవసేనను అభినందించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీతోపాటు జాతీయ, రాష్ట్రస్థాయి ప్రముఖులు, మంత్రులు తదితరులతో సాంస్కృతిక, సినీ కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు కళాకారులను, సాహితీవేత్తలను తన వంతుగా ప్రోత్సహిస్తున్న దేవసేన కృషి ఆదర్శనీయమని వారు పేర్కొన్నారు.

ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విజయ్ కుమార్



అమీర్‌పేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా గంగిరెడ్డి విజయ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన విజయ్‌కుమార్ 2011లో బాలానగర్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా(లా అండ్ ఆర్డర్) విధుల్లో చేరారు. అనంతరం జేఎన్‌టీయూకు బదిలీ అయ్యారు.

ఎస్ఆర్‌నగర్ డీఐగా శ్రీకాంత్..

ఎస్ఆర్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. మొదట ఐటీ సెల్‌లో ఎస్ఐగా పనిచేసిన శ్రీకాంత్ చాదర్‌ఘాట్, లంగర్‌హౌజ్ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేశారు.

హాస్టల్ ఎదుట పార్కు చేసిన బైక్ మాయం

యూసుఫ్‌గూడ, మే 3 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రొడ్డ మహేష్ ఎల్లారెడ్డిగూడలోని హాస్టల్లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 1న సొంతూరు జగిత్యాలకు వెళ్లి వచ్చాడు. సాయంత్రం హాస్టల్ ఎదుట పార్కు చేసిన బైక్(ఏపీ15 బీడీ9424) మాయమైందని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

భర్త, మామ వేధిస్తున్నారని ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, మే 3 (ఆంధ్రజ్యోతి): భర్త, మామ వేధిస్తున్నారని వివాహిత మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే మహిళ భర్త, మామ మానసికంగానూ, శారీరకంగానూ వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిల్లింగ్ స్టేషన్‌లో అందుబాటులోకి సీఎన్‌జీ


గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ వెల్ఫేర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో కొత్తగా సీఎన్‌జీ సేవలను సీపీ అవినాష్ మహంతి ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ గజారవు భూపాల్, డీసీపీలు, బీపీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

● హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

గచ్చిబౌలి, మే 3 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావు గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వరకు జరుగుతున్న ఫేజ్-2 శిల్పాలేఔట్ ఫ్లైఓవర్ పనులను పరిశీలించారు. ఈ నెల చివరి నాటికి పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత సర్వీస్‌రోడ్ పూర్తవుతుందని ప్రాజెక్టు ఇంజనీర్లు ఆయనకు వివరించారు. హైటెక్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ఖాజాగూడ జంక్షన్‌లోని ప్రతిపాదిత ఫ్లైఓవర్, అండర్‌పాస్ స్థలాన్ని సైతం కమిషనర్ కర్ణన్ పరిశీలించారు. మల్కం చెరువు వద్ద పారిశుధ్యం, వీధి కుక్కల బెడద గురించి వాకర్లు ఫిర్యాదు చేయగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీ ప్రశాంతి, ఎస్ఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హైదర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్

హైదర్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ హైదర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు అరుణ్‌కుమార్ నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల అధికారి సుభాష్‌చంద్రబోస్ శనివారం అరుణ్‌కుమార్ నియామకపత్రం అందజేశారు.

బోరబండ ఎంఎంటీఎస్ రైల్వే సమాచారం

అల్లాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): బోరబండ ఎంఎంటీఎస్ స్టేషన్ నుంచి లింగంపల్లి, హైద్రాబాద్, ఫలక్‌నుమా(వయా సికింద్రాబాద్) వైపునకు సమయ సూచికలను శనివారం రైల్వే అధికారులు వెల్లడించారు. వారు తెలిపిన సమాచారం ప్రకారం.. ++ గుర్తు కల్గిన ట్రైను సోమవారం నుంచి శుక్రవారం వరకు, && గుర్తు కల్గినవి కొత్తగా, అంటే గత నెల 20 నుంచి పునరుద్ధరించినవి. అనివార్య కారణాలతో ట్రైన్ రద్దు అవటం, సమయ సూచికలో మార్పుల కొరకు స్టేషన్ అధికారులను సంప్రదించాలని రైల్వే అధికారులు తెలిపారు.

లింగంపల్లి వైపు..
ఉదయం 05:57, 06:12, 06:30++, 07:09&&, 07:22, 08:17, 08:32, 09:02, 09:42, 09:42, 10:17, 10:17, 10:27++, 11:12
మధ్యాహ్నం 12:01&&
సాయంత్రం 16:57, 17:42++, 17:43, 17:57, 18:27, 18:51&&, 19:22, 19:15++
రాత్రి 20:11, 20:22, 20:42++, 21:02, 21:07, 21:41&&, 21:42++, 22:12, 22:37, 23:06&&, 23:17++
అర్ధరాత్రి 00:17

ఫలక్‌నుమ వైపు..
ఉదయం 04:16, 06:16, 07:01, 07:41++, 8:46, 09:15, 09:51, 10:41, 11:36&&
సాయంత్రం 16:31++, 16:56&&, 17:29, 17:46&&, 17:56++, 18:16, 18:56++, 19:36
రాత్రి 20:11&&, 20:16++, 21:41, 21:51, 22:29, 22:36(సికింద్రాబాద్ వరకు)&&, 23:05++, 23:40

హైద్రాబాద్‌కు
ఉదయం 07:20, 08:15, 10:05
సాయంత్రం 16:3++&&, 17:30, 19:10, రాత్రి 20:13, 29:25

మేడ్చల్‌కు:
ఉదయం 10:3, సాయంత్రం 18:46

ఘట్‌కేసర్‌కు:సాయంత్రం 17:36

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయరూ..!


పర్వత్‌నగర్ నుంచి మాధాపూర్ వెళ్లే దారిలో రోడ్డుపై గొయ్యి


స్థానికులు మ్యాన్‌హోల్ వద్ద ఏర్పాటు చేసిన రాళ్లు, కర్ర

హైటెక్ సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): పర్వత్‌నగర్ నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంలో మ్యాన్‌హోల్ శిథిలమైంది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు ఆ మ్యాన్‌హోల్ చుట్టూ రాళ్లను పెట్టి మధ్యలో ఓ కర్రను ఉంచారు. అటుగా వెళ్లే వాహనదారులు, పాదచారులు మ్యాన్‌హోల్ రంధ్రంలో పడకుండా ఉండేందుకు స్థానికులు చేసిన ఏర్పాట్లను అక్కడి వారు అభినందిస్తుంటే సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

వ్యాధి నివారణకు నాణ్యమైన నిర్ధారణ పరీక్షలు అవసరం

ఎక్సెల్ జినోమిక్స్ సీఈవో డాక్టర్ అమితవరాయ్


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అమితవరాయ్

బంజారాహిల్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): వ్యాధి నివారణ, చికిత్స అందాలంటే అందుకు నాణ్యమైన రోగ నిర్ధారణ పరీక్షలు అవసరమని ఎక్సెల్ జినోమిక్స్ సంస్థ వ్యవస్థాపక సీఈవో డాక్టర్ అమితవరాయ్ అన్నారు. క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ, చికిత్స తదితర అంశాలలో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక చికిత్స విధానాలపై ఎక్సెల్ జినోమిక్స్ సంస్థ ఆధ్వర్యంలో 'నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ ఇన్ న్యూరో ఆంకాలజీ" అనే పేరిట బంజారాహిల్స్‌లో శనివారం జాతీయ సదస్సు జరిగింది. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన న్యూరోసర్జన్లు, ఆంకాలజిస్టులు, బ్రెయిన్ ట్యూమర్ స్పెషలిస్టులు, పాథాలజిస్టులు సదస్సులో పాల్గొని పలు కీలక అంశాలపై తమ అనుభవాలను పంచుకున్నారు. డిజిటల్ పాథాలజీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత పరిజ్ఞానం రోజురోజుకూ పెరుగుతోన్న తరుణంలో బ్రెయిన్ క్యాన్సర్ చికిత్సలో సైతం జినోమిక్ డయాగ్నస్టిస్ ఎంతో దోహదం చేస్తుందని డాక్టర్ అమితవ రాయ్ అన్నారు. సదస్సులో భాగంగా రియల్ టైం సర్జరీలు, చర్చా వేదికలు నిర్వహించామన్నారు. రానున్న రోజుల్లో డయాగ్నోసిస్ రంగంలో రానున్న మార్పుల గురించి నిపుణులు చర్చించారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని


వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే తలసానిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

అమీర్‌పేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కమనీయంగా జరుగుతున్నాయి. రెండో రోజు శనివారం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి 108 కళశాలతో అభిషేకం, అర్చన, హారతి, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం, శ్రీ వేంకటేశ్వరస్వామి సహస్రనామ హోమం, ఊంజల్ సేవ, నైవేద్యం, హారతులు ఇచ్చారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ బొడ్డు కుమార్‌గౌడ్, ఈవో నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహ, గుడిగె శ్రీనివాస్ యాదవ్, హరిసింగ్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పారిస్ ఫ్యాషన్ వీక్‌లో మెరిసిన హామ్స్ టెక్ విద్యార్థులు


ప్రదర్శనలు ఇచ్చిన హామ్స్ టెక్ విద్యార్థులు





హైదరాబాద్ సిటీ , మే 3 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన హామ్స్ టెక్ కాలేజ్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు అంతర్జాతీయస్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇటీవల ముగిసిన పారిస్ ఫ్యాషన్ వీక్‌లో తమదైన సృజనను చూపుతూ రూపొందించిన డిజైన్స్‌ను ప్రదర్శించారు. ఈ విశేషాలను సంస్థ నిర్వాహకులు అజితా రెడ్డి చెబుతూ తమ ఫ్యాషన్ డిజైన్ విద్యార్థుల బృందం ఇటీవల ముగిసిన పారిస్ ఫ్యాషన్ వీక్‌లో తమ కలెక్షన్లను ప్రదర్శించడం ద్వారా ప్రపంచ వేదికపై తమదైన ముద్ర వేశారన్నారు. వినూత్న ఫ్యాషన్ శైలులకు ప్రపంచ రాజధాని లాంటి పారిస్ నగరంలో తమ యువ డిజైనర్లకు సృజనాత్మకశక్తిని ప్రదర్శించే అరుదైన అవకాశం లభించడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ఆ ప్రతిష్టాత్మక రన్ వే దగ్గర గడిపిన ప్రతీ క్షణం విద్యార్థులకు ఒక మాస్టర్ క్లాస్‌గా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ ఫ్యాషన్ వీక్‌లో విద్యార్థులు ప్రొఫెషనల్ మోడల్స్ స్టైలిస్ట్‌లతో కలిపి పనిచేశారని, తద్వారా ప్రపంచ మార్కెట్‌కు సంబంధించిన ప్రాక్టికల్ అనుభవాన్ని అందుకున్నారని తెలిపారు. ఈ పారిస్ యాత్ర విద్యార్థులకు ఒక అద్భుతమైన ప్రారంభంగా నిలవగలదని పేర్కొన్నారు.


వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్ గౌరీశంకర్‌కాలనీలో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి


ఎర్రగడ్డలో సన్నబియ్యం లబ్దిదారుడు అప్సర్ ఇంట్లో భోజనం చేస్తున్న సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ మహ్మద్ మోసిన్ ఖురేషి, ఎర్ర కృష్ణకుమార్, ఆజం, ఆకాష్ తదితరులు


బేగంపేట డివిజన్ ప్రకాశ్‌నగర్‌లోని రేషన్ దుకాణం వద్ద సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, విశాల్ సుదాం, గౌరపల్లి రమేష్, నిర్మల తదితరులు


పాదచారుల దాహార్తిని తీర్చాలి



మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి, నరసింహారావు తదితరులు

ఎర్రగడ్డ, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని స్నేహిత వాకర్స్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లాది విజయలక్ష్మి అన్నారు. శనివారం కళ్యాణ్‌నగర్ వెంచర్ త్రీలో స్నేహిత వాకర్స్ క్లబ్ అసోసియేషన్, కళ్యాణ్‌నగర్ సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పాదచారులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వెంచర్ త్రీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగళ్ల నరసింహారావు మాట్లాడుతూ కళ్యాణ్‌నగర్‌లో ఆదివారం కూడా మజ్జిగ పంపిణీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్నేహిత వాకర్స్ క్లబ్ అసోసియేషన్, కళ్యాణ్‌నగర్ వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బధిర విద్యార్థుల ప్రతిభ ప్రశంసనీయం


బధిర విద్యార్థులను అభినందిస్తున్న డీపీకే బాబు

బంజారాహిల్స్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆశ్రయ్-ఆకృతి బధిర పాఠశాల విద్యార్థులు ప్రతీ సంవత్సరం వందశాతం ఉత్తీర్ణతతోపాటు 80 శాతానికి పైగా మార్కులతో ప్రతిభను చూపడం ప్రశంసనీయమని ఆశ్రయ్-ఆకృతి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డీపీకే బాబు, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ డి.శశికళ అన్నారు. శ్రీనగర్‌కాలనీ ఆశ్రయ్-ఆకృతి బధిర పాఠశాల విద్యార్థులు పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా శనివారం అభినందన సభను ఏర్పాటు చేశారు. బధిరులైనా వారి ప్రతిభాపాటవాలు, అంకితభావం అభినందనీయమన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో తమకున్న మధురక్షణాలను, వారిలోని గొప్ప మేధస్సును గుర్తు చేసుకున్నారు.





డ్రైనేజీ పనులు చేయిస్తున్న జలమండలి డీజీం విద్యాసాగర్, ఏఈఈ స్రవంతి

రంగంలోకి దిగిన జలమండలి అధికారులు

అడ్డగుట్ట, మే 3 (ఆంధ్రజ్యోతి) : తాగునీటిలో డ్రైనేజీ నీళ్లు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై మారేడుపల్లి జలమండలి డీజీఎం విద్యాసాగర్, మారేడుపల్లి ఏఈఈ అధికారిణి స్రవంతి స్పందించి రంగంలోకి దిగారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఈఈ తెలిపారు. ఈ ప్రాంతంలో చిన్న గల్లీ ఉండడం కారణంగా ఒకే మ్యాన్‌హోల్‌లో మంచినీటి పైప్‌లైన్, డ్రైనేజీ పైప్‌లైన్లు ఉన్నాయని, త్వరలో ఈ డ్రైనేజీ పైప్‌లైన్ వేర్వేరుగా చేసి వినియోగంలోకి తీసుకొస్తామని ఏఈఈ తెలిపారు.



అమరావతి స్కూలు విద్యార్థులను అభినందిస్తున్న విద్యాశాఖ అధికారి శ్రవణ్ కుమార్

విద్యార్థులకు అభినందనలు

బౌద్ధనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన అమరావతి గ్రూపు ఆఫ్ స్కూలు విద్యార్థులను శనివారం నామాలగుండులోని స్కూలు ఆవరణలో ముషీరాబాద్ మండల విద్యాశాఖ అధికారి శ్రవణ్ కుమార్ అభినందించారు. తేజస్విని(579), సమయా ఫాతిమా(570), పి. గణేష్(569), ఏ.మణికంఠ(558), బి.నిశాంత్(556)లకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

శ్మశానవాటిక నూతన అధ్యక్షుడి నియామకం

అడ్డగుట్ట, మే 3 (ఆంధ్రజ్యోతి) : లాలాగూడ శాంతినగర్‌లోని సత్యహరిచంద్ర శ్మశాన వాటిక నూతన అధ్యక్షుడిగా తాండ్ర రమేష్ నియమితులయ్యారు. నియమాక పత్రాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా స్మశాన వాటికలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.



తాండ్ర రమేష్



రేషన్ దుకాణంలో సన్నబియ్యం అందజేస్తున్న కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, విశాల్ సుదాం

పేద ప్రజల కోసమే సన్న బియ్యం పంపిణీ

● కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

బేగంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వం సన్న బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బేగంపేట డివిజన్‌లోని ప్రకాశ్‌నగర్‌లో పార్టీ కో-ఆర్డినేటర్ విశాల్ సుదాం ఆధ్వర్యంలో రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి బండి రమేష్ హాజరయ్యారు. తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యాన్ని అందజేశారు. అనంతరం ప్రభుత్వం పేద ప్రజల కోసం తీసుకొచ్చిన పథకాలను వివరించడంతో పాటు సన్నబియ్యం తీసుకున్న వారిని పార్టీ తరఫున సన్మానించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రభుత్వం మూడుకోట్ల మంది ప్రజలకు సన్నబియ్యం అందించడం సహసోపేత నిర్ణయమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు దగ్గర నుంచి కులగణన వరకు ముఖ్యమంత్రి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గౌరపల్లి రమేష్, హసిటోచర్, జగదీష్, పర్వేజ్, కరుణాకర్, అలీ, నిర్మల, సాజీద్, రాఘవ, మోహిత్, హనిష్ ఖాన్, మనోజ్, కృష్ణ, బబ్లూ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రెజిమెంటల్‌బజార్, మే 3(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు మార్కెట్ ఎస్సై మమత తెలిపారు .ఏప్రిల్ 28న సికింద్రాబాద్ శివాజీనగర్‌లో ఓ వ్యక్తి అనారోగ్యంతో ఉండగా గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతడు చికిత్స పొందుతూ 29న మృతి చెందినట్లు గాంధీ వైద్యులు మార్కెట్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వయస్సు 62 సంవత్సరాలు ఉంటుంది. అతడి పేరు రమేష్, తండ్రి మారయ్య కుటుంబ సభ్యుల గురించి ఆరాతీయగా ఎటువంటి సమాచారం లభించలేదని పోలీసులు తెలిపారు. బంధువులు గుర్తిస్తే ఎస్సైను సంప్రదించాలని సూచించారు.

ట్రాఫిక్.. బేజార్

తార్నాక చౌరస్తాలో పరిష్కారం కాని ట్రాఫిక్ సమస్య

వాహనదారుల్లో తీవ్ర అసహనం



తార్నాక చౌరస్తాలో నిలిచిపోయిన వాహనాలు

తార్నాక, మే 3 (ఆంధ్రజ్యోతి): తార్నాక చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను పరిష్కంచేందుకు ట్రాఫిక్ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం వాహనదారులను మరింత కష్టాల్లోకి నెట్టింది. వాహనదారులకు ట్రాఫిక్ జామ్‌ల నుంచి విముక్తి కలిగించేందుకు తార్నాక చౌరస్తాను మూసివేసి యూటర్న్‌లను ఏర్పాటు చేశారు. అయితే యూటర్న్‌లతో ఇంధనంతో పాటు, సమయం కూడా వృథా అవుతోందని వాహనదారుల విన్నపం మేరకు ఇటీవల ఉన్నతాధికారులు యూటర్న్‌ల నుంచి విముక్తి కలిగించేవిధంగా తార్నాక జంక్షన్‌ను ప్రయోగాత్మకంగా 15 రోజుల పాటు పునరుద్ధరించారు. పదేళ్ల క్రితం నాటి వాహనాల సంఖ్యను ప్రస్తుతం పెరిగిన వాహనాల సంఖ్యను అంచనా వేయకుండా, అలాగే ఎలాంటి రోడ్ల విస్తరణ పనులు చేపట్టకుండా తార్నాక జంక్షన్‌ను పునరుద్ధరించడంతో ట్రాఫిక్ కష్టాలు మరింత పెరిగాయి.

● ఉస్మానియా యూనివర్సిటీ నుంచి లాలాపేట్, హబ్సిగూడ నుంచి సికింద్రాబాద్ వైపు ఉదయం, సాయంత్రం కిలో మీటరు మేర భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవి కావడం వల్ల ఎండలు మండుతుండటం, మరోవైపు సిగ్నల్స్ వద్ద ఎండలో నిమిషాల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురించడంతో ట్రాఫిక్ సిగ్నల్స్ కంటే యూటర్న్‌లే బెటర్ అనే పరిస్థితి వాహనదారుల్లో ఏర్పడింది.

శాశ్వత పరిష్కారం చూపాలి



ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి. తార్నాక జంక్షన్ వద్ద ప్రతిరోజూ ఇదే సమస్య తలెత్తుతోంది. దీనివల్ల అంబులెన్స్‌లు, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇరుకు గల్లీల గుండా ప్రయాణిస్తూ యూటర్న్‌ల ద్వారా తార్నాక జంక్షన్‌ను దాటాల్సిన పరిస్థితి దాపురించింది. ఇప్పటికైనా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

- ఆంజనేయులు, వాహనదారుడు

స్థానిక సంస్థలను బలహీనపరుస్తున్న బీజేపీ

● కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్

సికింద్రాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను బలహీనపరుస్తున్నదని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ విమర్శించారు. రసూల్‌పురాలో శనివారం సాయంత్రం నిర్వహించిన జై బాపు-జై భీమ్-జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రసూల్‌పురా, కంగల్ చౌరస్తా, జగదీష్‌నగర్ కాలనీ, నారాయణ జోపిడి, ఇందిరమ్మనగర్, బీరప్ప ఆలయం, అర్జున్‌నగర్‌ల మీదుగా అన్నానగర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించకుండా కంటోన్మెంట్ బోర్డు ప్రజలను బీజేపీ సమస్యల వలయంలో నెట్టిందని ఆరోపించారు.

తమ పార్టీ నాయకులను నామినేటెడ్ సభ్యులుగా నియమిస్తూ, అన్ని వార్డులకు సభ్యులు లేకుండా చేసిన ఘనత బీజేపీకే దక్కిందని అన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్, తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్యాంసన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



రసూల్‌పురాలో పర్యటించిన శ్రీగణేష్, కల్వ సుజాత తదితరులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

తిరుమలగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కంటోన్మెంటు ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గంగపుత్ర సంఘం బొల్లారం ఆధ్వర్యంలో శనివారం జనహిత సేవాట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం ప్రతినిధులు, డాక్టర్లను ఆయన అభినందించారు. కిమ్స్ ఆసుపత్రి వైద్యులు 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. సాయిజ్యోతి ఐ ఆసుపత్రి వారు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ రక్తంలో హీమోగ్లోబిన్ శాతం పరీక్షించి, రక్తహీనత ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లను అందజేశారు. ఈ శిబిరంలో బోర్డు మాజీ సభ్యుడు జయప్రకాష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ నరసింహ మూర్తి, జి.శోభారాణి, నర్సింగ్‌రావు, భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివరామక్రిష్ణ, గంగపుత్ర సంఘం బొల్లారం అధ్యక్షుడు పూస యోగేశ్వర్, సలహాదారుడు నరహరి, ఉపాధ్యక్షుడు పి.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.జైనాజ్, సురేష్, పూర్ణచందర్, ఉమామహేశ్వరి, విజయలక్ష్మీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా భాస్కర్

రెజిమెంటల్‌బజార్, మే 3(ఆంధ్రజ్యోతి): గోపాలపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి గోపాలపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. గతంలో పనిచేసిన ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రాములు లంగర్‌హౌజ్ ఎస్‌హెచ్‌ఓగా బదిలీపై వెళ్లారు.



భాస్కర్

తుకారాంగేట్ సీఐగా శ్రీకాంత్‌రెడ్డి

అడ్డగుట్ట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నార్త్‌జోన్ గోపాలపురం డివిజన్ తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన శంకర్ నాయక్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ డీఐగా బదిలై వెళ్లిపోయారు. ఈ సందర్భంగా నూతన సీఐ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో నిక్కచితంగా ఉంటామని ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. సమస్యలు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.



శ్రీకాంత్ రెడ్డి



డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాణికేశ్వర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ఒడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు వినతి

తార్నాక, మే 3 (ఆంధ్రజ్యోతి) : వడ్డెర సామాజికవర్గ ఆరాధ్యదైవం ఒడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు సహకారాన్ని అందించాలని కోరుతూ మాణికేశ్వర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెర సామాజికవర్గం ఆత్మగౌరవం కోసం మాణికేశ్వర్‌నగర్ కమాన్ పక్కన ఓబన్న విగ్రహన్ని ప్రతిష్ఠించేందుకు సభ్యులందరం నిర్ణయించడం జరిగిందని, ఈ విషయాన్ని డిప్యూటీ మేయర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. దానికి సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ విగ్రహ ఏర్పాటుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాణికేశ్వర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.కుమార్, ఉపాధ్యక్షుడు ఎ.మల్లిఖార్జున్, జనరల్ సెక్రటరీ బి.ఆంజనేయులు, ట్రెజరర్ పి.శ్రీనివాస్, జాయంట్ సెక్రటరీ జి.హరి, ఎస్.వెంకటేశ్, అరుణ్ కుమార్, బోదాసు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి పూర్వవైభవం ఖాయం: వల్లారపు

సికింద్రాబాద్, మే 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయమని ఆ పార్టీ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ అన్నారు. సంస్థాగతంగా పటిష్టం చేసే చర్యల్లో భాగంగా ఇటీవల పూర్తి చేసిన పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం బౌద్ధనగర్ డివిజన్‌లో నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సభ్యత్వం తీసుకున్న వారికి శ్రీనివాస్ సభ్యత్వ కార్డులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం కార్యకర్తల పార్టీ అన్నారు. పార్టీకి కార్యకర్తలే పునాదులని, అధికారంలో లేకపోయినా వారి త్యాగాల వల్లే అత్యధిక కార్యకర్తలున్న పార్టీగా మన్ననలు పొందుతున్నదని పేర్కొన్నారు. టీడీపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు గరిగే ప్రవీణ్, సీనియర్ నాయకులు శంకర్ ముదిరాజ్, శ్రీశైలం, చంద్రమోహన్, రవి, రమేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న వల్లారపు శ్రీనివాస్

విద్యార్థులకు వేసవి క్రీడా శిబిరాలు

బోయినపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ హైదరాబాద్ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ విద్యాసంస్థల విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు మే 1 నుంచి ప్రారంభమయ్యాయి. ఈ శిబిరాలు 30 రోజుల పాటు మోడల్ స్పోర్ట్స్ స్కూల్స్, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయిన్‌పల్లి, హైదరాబాద్ వేదికగా జరుగనున్నాయి. ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బోయినపల్లి బాపూజీనగర్ గిరిజన సంక్షేమ వాటర్ స్పోర్ట్స్ వసతి గృహం ఆతిథ్యం ఇస్తున్నది. ఈ శిక్షణ తరగతులు, వసతి ఏర్పాట్లు హాస్టల్ ఇన్‌చార్జి నీలిమ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ప్రధానంగా ఫెన్సింగ్ క్రీడలతో పాటు, వాటర్ స్పోర్ట్స్ క్రీడలలో శిక్షణ పొందుతున్నారు. ఇవి విద్యార్థులకు క్రీడా నైపుణ్యాలను అందిస్తాయి. శిబిరంలో విద్యార్థులకు ఆరోగ్య సేవలు, పౌష్టికాహారం వసతులను జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కల్పిస్తున్నది. ఆసక్తి గల క్రీడాకారులు బోయినపల్లి బాపూజీనగర్ గిరిజన సంక్షేమశాఖ వసతి గృహంలో సంప్రదించాలని డీటీడీఓ కోటజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువతలోని ప్రతిభను వెలికితీసి దేశస్థాయిలో ప్రాతినిధ్యం వహించేస్థాయికి తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వమే కాక, క్రమశిక్షణ, నాయకత్వం, సమూహ భావన వంటి విలువలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. విద్యార్థుందరూ ఆసక్తిగా పాల్గొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని వెల్లడించారు.



వేసవి క్రీడా శిబిరాల్లో శిక్షణ పొందుతున్న వివిధ జిల్లాల విద్యార్థులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మచ్చబొల్లారం, మే 3 (ఆంధ్రజ్యోతి): నిత్య యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం, ఆనందాన్ని పొందవచ్చని యోగా మాస్టర్ రంజిత్ గురూజీ తెలిపారు. శనివారం మచ్చబొల్లారం డివిజన్ హెచ్‌ఎంటి కాలనీలో శ్రీ సత్య సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు ఉచితంగా నిర్వహించిన యోగా క్లాస్ ముగింపు ఉత్సవంలో మాట్లాడుతూ ప్రస్తుత దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని వారు కోరారు. 20 సంవత్సరాల నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో వేలమందికి జ్ఞానాన్ని అందించి వారి జీవన విధానంలో మార్పులు చూశానన్నారు. అలాగే యోగాభ్యాసకుల కోరిక మేరకు ఆదివారం నుంచి 10 రోజుల పాటు బృందావాన్ కాలనీలోని సాయి బాబా ఆలయంలో ఉచితంగా యోగా, ధ్యానం నేర్పించడం జరుగుతుందని అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే తలసానిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

అమీర్‌పేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌నగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కమనీయంగా జరుగుతున్నాయి. రెండో రోజు శనివారం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి 108 కళశాలతో అభిషేకం, అర్చన, హారతి, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. సాయంత్రం శ్రీ విష్ణుసహస్రనామ పారాయణం, శ్రీ వేంకటేశ్వరస్వామి సహస్ర నామ హోమం, ఊంజల్ సేవ, నైవేద్యం, హారతులు ఇచ్చారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొడ్డు కుమార్‌గౌడ్, ఈవో నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహ, గుడిగె శ్రీనివాస్ యాదవ్, హరిసింగ్ జాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు: అరెస్ట్

అల్వాల్, మే3 (ఆంధ్రజ్యోతి): ఒక మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి లోబర్చుకున్న ఇద్దరు వ్యక్తులపై అల్వాల్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అల్వాల్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రాహుల్‌దేవ్ వివరాల ప్రకారం... అల్వాల్ కానాజిగూడ ఇంద్రానగర్‌కు చెందిన సుమీర్ (19)బైక్ మెకానిక్, కార్ఖానా ప్రాంతానికి చెందిన జావేద్(26)తో పరిచయం ఏర్పడింది. సుమీర్‌కు సదరు బాలిక ఒక వివాహ వేడుకల్లో పరిచయం అయ్యింది. దీనిని అవకాశంగా తీసుకొని సుమీర్ ఆమెతో చాటింగ్ చేస్తూ దగ్గరయ్యారు. ఒక రోజు అవకాశం తీసుకొని అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయాన్ని తెలుసుకున్న జావేద్ కూడా బాలికను భయపెట్టి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో సదరు బాలిక తల్లిదండ్రులు శనివారం అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులైన సుమీర్, జావేద్‌పై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

మద్యంప్రియులకు అడ్డాగా పార్శిగుట్ట

● మహిళల పట్ల అసభ్య ప్రవర్తన ● నిత్యం గొడవలు ● ట్రాఫిక్‌కు అంతరాయం

బౌద్ధనగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధి పార్శిగుట్ట చౌరస్తా మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్క రెండు వైన్స్ షాపులు, ఒక బార్, కూతవేటు దూరంలో మరో బార్ ఉంది. నిబంధనలు పక్కన పెట్టి సమయపాలన లేకుండా వైన్స్, బార్ నిర్వాహకులు వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఈ చౌరస్తాలో ఉన్న వైన్స్ షాపులు, బార్‌లను తీసివేయాలని స్థానికులు ధర్నాలు చేసిన సందర్భాలున్నాయి. వీటిని తొలగించాలని స్థానిక మహిళలు, స్వచ్ఛంద సేవా సంఘాలు కలిసి ఎక్సైజ్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఇక్కడి నుంచి కొన్ని వందల సర్వీసు ఆటోలు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు తిరుగుతూ ఉంటాయి. రాంనగర్, ముషీరాబాద్, ట్యాంక్‌బండ్, కోఠి, సికింద్రాబాద్‌తో పాటు నగరంలో వివిధ ప్రాంతాలకు పార్శిగుట్ట చౌరస్తా నుంచి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పోలీసులకు ఫిర్యాదు చేసిన నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారని వారు వాపోతున్నారు. తాగిన మైకంలో మందుబాబులు గొడవలు పెట్టుకుని స్థానికులను భయభ్రాంతులకు గురిచేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తుంటారని వాపోతున్నారు.

నిబంధనలు పక్కన..

నగరంలో ఎక్కడా లేని వైన్స్ షాపులు, బార్లు, కల్లు కాంపౌండ్‌లు పార్శిగుట్టలో ఉన్నాయి. నిబంధనలను పక్కన పెట్టి ఉదయం ఆరుగంటల నుంచే ఈ ప్రాంతంలో కల్లు, మద్యం అమ్మకాలు మొదలవుతుంటాయి. రద్దీగా ఉండే ఈ చౌరస్తాలో పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు అసలు కనిపించారు. ఏదో సమయంలో చలాన్లు రాసి తమ పని చేసుకుంటారు. అసలు శాంతి భద్రతల గురించి పట్టించుకోవటంలేదని స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు. వారాసిగూడ, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్లకు ఈ చౌరస్తా సరిహద్దులుండటంతో పోలీసులు అంతగా పట్టించుకోవటంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ శాంతిభద్రతలు కరువయ్యాయని, నిత్యం ఏదోరకంగా నేరాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వైన్‌షాపులు బంద్ ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో పుష్కలంగా మద్యం విక్రయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

బందోబస్తు కట్టుదిట్టం చేయండి

పోలీసు బందోబస్తును కట్టుదిట్టం చేయాలని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య ఏసీపీ జైపాల్ రెడ్డి, వారాసిగూడ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్‌కు సూచించారు. పార్శిగుట్ట చౌరస్తాపై ఫిర్యాదులు ఎక్కువ అందుతున్నాయని తెలిపారు. వైన్స్, బార్, కల్లు కాంపౌండ్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని, మద్యం షాపుల ముందు గొడవలు జరిగితే వారినే బాధ్యులను చేయాలని సూచించారు. గొడవలు జరిగినప్పుడు దుకాణదారులు సమాచారం ఇవ్వకపోతే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

- నర్సయ్య, అడిషనల్ డీసీపీ



పార్శిగుట్ట చౌరస్తాలో ఉన్న వైన్ షాపులు

నా పోరాటం కొనసాగుతుంది



ఈ చౌరస్తాలో వైన్స్‌షాపులు, బార్లు, కల్లు కాంపౌండ్‌లను తొలగించాలని నాలుగు సంవత్సరాల నుంచి పోరాడుతున్నాం. 2021లో బస్తీ మహిళలతో కలిసి వీటిని తొలగించాలని 21రోజులు పాటు నిరహారదీక్షలు చేశా. అధికారుల నిర్లక్ష్యం, ఆరోగ్యం క్షీణించటంతో నిరాహారదీక్షలు విరమించా. ఇప్పటికి నా పోరాటం ఆగలేదు.

- డప్పు సునీత, మహిళా రక్షణ పోరాట సమితి అధ్యక్షురాలు, పార్శిగుట్ట

మహిళలకు భద్రత కరువు



ఇక్కడ అధికంగా మద్యం షాపులుండటంతో మహిళలకు భద్రత లేకుండా పోయింది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసిన ఫలితం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైన్ షాపులను తీయించేలా తగిన చర్యలు తీసుకోవాలి.

- బి. జ్యోతి, గృహిణి, పార్శిగుట్ట